నిశాంత కళ్ళముందు ఆ కాల్‌గర్ల్ రూపం అస్పష్టంగా మెదిలింది.  ఆ కాల్‌గర్ల్ తనకు చేసిన ఉపకారానికి మనసులోనే కృతజ్ఞలర్పించింది.

నిశాంత.

"మందుకూ, ఆడదానికి బానిసైన సిద్ధార్థ, మిగతా వ్యసనాలకు బానిస కావడం అంత కష్టమేం  కాదు! కదూ.......... అతను నీ వెనక తిరుగు తున్నాడని ప్రపంచానికి.......ముఖ్యంగా మహంతకు తెలియాలి.......! మన ప్లాన్‌లో నెక్ట్స్ పార్ట్ సెంటర్ అతడిని ఢిల్లీ తీసుకెళ్ళగలవా?"

"ఎందుకు సార్?" భయంగా అడిగింది నిశాంత.

ఢిల్లీ అనగానే ఎందుకు భయపడుతున్నావ్?"

చురుకుగా, వేగంగా ఆలోచించిందామె.

"అక్కడ మహంత  మనుషులుంటే?"

"ఈ దేశ్‌ముఖ్ నీ వెనక వున్నంతకాలం మహంత మనుషులు గానీ, మహంత గానీ నిన్నేం చేయలేరు.  డోన్ట్ వర్రీ........! ప్లాన్ చెబుతాను విను....." చెప్పడం ప్రారంభించాడు దేశ్‌ముఖ్.

నిశాంత వింటోంది.

"సిద్ధార్థ ఎప్పుడూ చూడని కొత్తలోకాలు చూడాలి. జూదం.........గేంబ్లింగ్, రేసులు, లోఫర్స్, డాఫర్స్, పింప్స్ మధ్య అతను తిరగాలి.  మహంత గ్రేట్ ఎంపైర్‌కి వారసుడు డ్రగ్స్‌కు బానిస కావాలి.  మత్తుమందులేని క్షణం అతని జీవితంలో వుండకూడదు.  ఆ పతనాన్ని నేను స్పష్టంగా చూడాలి.  అండర్‌స్టాండ్?" ఆవేశంగా అన్నాడే దేశ్‌ముఖ్.

"సిద్ధార్థ ఇక్కడ లేకపోతే అనంతమూర్తికి అనుమానం వస్తుందేమో?" భయంగా అడిగింది నిశాంత.

"అనంతమూర్తి.......వాడి గురించి నువ్వుమర్చిపో  బైదిబై ......నీకో గుడ్ న్యూస్!  నీ తండ్రి కోసం ఫ్లైట్‌లో జైపూర్ నుంచి ఆర్టిఫిషియల్‌లెగ్ తెప్పించాను."

సిద్ధార్థ విషయంలో ఏదో ప్రశ్న వేయబోయిన నిశాంత మరి మాట్లాడలేకపోయింది.

"వారం రోజులలో నీ తండ్రి నడుస్తున్న వీడియో నువ్వు చూస్తావ్.  సిద్ధార్థను ఢిల్లీ ఎప్పుడు తీసుకెళ్తున్నావ్?" ఆమె మాట్లాడటానికి ఏ మాత్రం అవకాశం యివ్వకుండా అడిగాడు దేశ్‌ముఖ్.

"రేపే........" నిశాంత స్థిరంగా అంది.

ఆ తరువాత అయిదు నిమిషాలసేపు మాటలురాని మూగదానిలా వుండిపోయింది. నిశాంత.

ఈ ఒప్పందాన్ని రద్దుచేసుకుని, దేశ్‌ముఖ్‌కి దూరంగా వెళ్ళిపోతే?

ఆయన పగకు సిద్ధార్థతోపాటు తను కూడా బలైపోతుంది ముఖ్యముగా తన తండ్రి.......

తన గ్రామం........పచ్చదనాన్ని నింపుకుంటున్న తన గ్రామం శాశ్వతంగా మోడువారిపోతుంది.

రెస్టారెంట్‌లో పిచ్చిదానిలా పచార్లు చేస్తోంది నిశాంత.

తప్పదు! సిద్ధార్థను ఢిల్లీ తీసుకెళ్ళక తప్పదు. భారంగా నిట్టూర్చి రూమ్‌లోంచి బయటకు రాబోయిన నిశాంత-

ఎదురుగా లోనికొస్తున్న సిద్ధార్థను చూసి రాని నవ్వును ముఖం మీదకు తెచ్చుకుంది.

"ఎంటీ అదోలా వున్నావ్?" లోనికొస్తూనే అడిగాడతను.

"అర్జంటుగా ఢిల్లీ ప్రోగ్రాం......"

"నాకు చెప్పకుండానే మాయమైపోదామనుకుంటున్నావా?"

"మరి నాతో నువ్వు రాలేవుగా......"

"ఆ రోజే చెప్పాను........! నీతో ఎక్కడికైనా వస్తాను........నువ్వు రమ్మంటే........"

ఆ మాటలకు సన్నని ఉల్లి పొర కాగితం మీదనుంచి జారిపడుతున్న నీటిబిందువులా అయిపోయింది నిశాంత మనసు!

సరిగ్గా రెండు గంటల తరువాత డెహ్రాడూన్‌కి చెందిన చావ్లా ట్రావెల్స్ నుంచి ఓ వ్యక్తి వచ్చి టాక్సీ సిద్ధంగా వుందని చెప్పి వెళ్ళి పోయాడు.

దేశ్‌ముఖ్ నెట్‌వర్క్‌కి ఆశ్చర్యపోయింది నిశాంత.

అన్నీ తెల్సిన ఆయన మానవ కళ్యాణం కోసం వినియోగించాల్సిన తన మేధస్సును, ఒక మనిషి నాశనం కోసం వుపయోగించడం-

ఈ పగ నుంచి ఆయన మనసును తను మళ్ళించలేదా......? కొంచ్చి క్షణాలు ఆలోచనలో పడిపోయింది నిశాంత.

* * * * * * * * * *

సన్నటి మంచు, సన్నటి వర్షపు తుంపర్లు-ముస్సోరీ నుంచి టాక్సీ బయలుదేరింది.

నిశాంత చేతివి తన చేతిలోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు సిద్ధార్థ.

"బ్లయిండ్ బ్లాంక్ విత్ పెయిన్" చిన్నగా అన్నాడతను

"ఏమిటి గొణుక్కుంటున్నావు?" నవ్వుతూ అడిగింది ఆమె.

ఆ ఇంగ్లీషు పదాల్ని మళ్ళీ అన్నాడు.

"అంటే?"

"చెప్పుకో చూద్దాం" ...

"గొణుక్కుంటే చెప్పడానికి నేనేం లిప్ మూవ్‌మెంట్ ఎక్స్‌పర్ట్‌ని కాదు" ఆ చేతిని పక్కకుతీసేస్తూ అంది.

"పోనీ నేను చెప్తానులే! గుడ్డిది, ఖాళీగా కనిపించేది, బాధపెట్టేదీ ఏంటో చెప్పు?"

"నాకు సామెతలు రావు"

"నేను చెప్పనా? ప్రేమ.......ప్రేమ గుడ్డిది........ఖాళీగా, డొల్లగానే కనిపిస్తుంది. బాధపెడుతుంది. కదా........"

విచిత్రంగా చూసింది నిశాంత.

"నీకెప్పుడీ విషయం తెలిసింది?" అడిగింది.

"నిన్ను కలిసినప్పుడు....నీతో తిరిగినప్పుడు........నువ్వు కనిపించనప్పుడు......" విండోలోంచి బయటలోకి చూస్తూ అన్నాడతను.

అమాయకంగా కనిపిస్తున్న అతని కళ్ళలోకి ప్రేమగా చూసింది ఆమె. ఒక్క క్షణం ఆమె మనసు బాధగా మూలిగింది.

"నన్ను నువ్వు అమితంగా ప్రేమిస్తున్నావ్.......!నీ వ్య క్తిత్వాన్ని నాశనం చేయడానికి నిన్ను నేను బలిపశువును చేస్తున్నాను......" మనసులో అనుకుందామె.

"నువ్వు నన్ను ప్రేమిస్తు9న్నావా లేదా?" ఆకస్మాత్తుగా అడిగాడు అతను.

"నన్ను క్షమించు! నీలాంటి గొప్ప ప్రేమికుడిని ప్రేమించే అర్హత నాకు లేదు అయామ్ ఎక్రుకెడ్ ఉమెన్! ఎస్..... అయామ్ ఎ క్రుకెడ్ ఉమెన్......." ఎస్...... అయామ్ ఎ క్రుకెడ్ ఉమెన్ ........" ధీర్ఘంగా లోలోనే విశ్వసించింది నిశాంత బాధగా.

* * * * * * * * * * * *

ఢిల్లీ లాల్‌బాగ్ ఏరియాలో కన్పించిన వ్యక్తులను చూసి ఆశ్చర్యపోయింది నిశాంత.

అదొక అండర్ వరల్డ్! రాత్రింబవళ్ళూ! రాత్రింబవళ్ళూ జరిగే వ్యభిచారం, జూదం విచ్చలవిడిగా దొరికే డ్రగ్స్.

దేశ్‌ముఖ్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆ ఏరియాలోని గెస్ట్ హౌస్‌లోకి అడుగుపెట్టింది సిద్ధార్థతో నిశాంత.

ఆ గెస్ట్‌హౌస్‌లో ఎక్కువమంది ఫారినర్స్, తక్కువమది ఇండియన్స్ వున్నారు.

ఆ ఫారినర్స్‌ని హిప్పీలుగా గుర్తుపట్టడానికి అట్టే సమయం పట్టలేదు ఆమెకు.

అతనికి ఆలోకం వింతగా, అద్భుతంగా వుంది.

అతడికి చూడగానే విదేశీ యువతులు అతన్ని చుట్టుముట్టేశారు.

విశాలమైన ఆ గెస్ట్‌హౌస్‌లో తన రూమ్‌లో కెళ్ళిపోయి, తలుపులు వేసుకుని బాధపడటం తప్ప, మరేం చేయలేకపోయింది నిశాంత.

ఆమె ఎదురుగానే, ఆమె చూస్తూండగానే అతని పతనం ప్రారంభమయింది.

ఆ గెస్ట్‌హౌస్, అక్కడి మనుషులు, అక్కడ నడుస్తున్న జూదం, అంతా దేశ్‌ముఖ్ సృష్టించిన విశ్వామిత్ర సృష్టి అని పాపం నిశాంతకు తెలీదు.

మధ్యలో ఒకసారి దేశ్‌ముఖ్ నుంచి ఫోనొచ్చింది నిశాంతకు.

"చూశావాబేబీ! లక్ష్యం దిశగా చేరుతున్నందుకు ఆనందంగా వుంది పాతికేళ్ళపాటు అపురూపంగా, అందంగా, ఆరోగ్యంగా పెరిగిన అతను......వారం రోజులలో బేవర్స్‌గాడిలా తయారౌతాడు, పతనం, అధఃపతనం.........పాతికేళ్ళుగా నాలో గూడుకట్టుకున్న కసి, పగ! నిశాంతా! వాడి పతనం కోసం డబ్బుని నీళ్ళలా ఖర్చుపెట్టు ముఖ్యంగా ఆ ఫారిన్ అమ్మాయిల కోసం అతను తహతహలాడుతున్నాడు కదూ?"

"అవున్సార్! ఆ హిప్పీ గ్రూప్‌తో ఎక్కడికి వెళ్తాడో తెలీదు. ఏం చేస్తున్నాడో తెలీదు.

అతను నాకు కనిపించి నాలుగురోజులైంది" బాధగా చెప్పింది నిశాంత.

"కంగారుపడకు బేబీ! నువ్వు చేయలేని పనులు కొంతమంది చేస్తున్నారు. డ్రగ్స్‌కి బానిసైన అతను........ రోజుకో అమ్మాయితో హాయిఅగా కాలక్షేపం చేస్తున్నాడు. నిశాంతా...... మనం ఎక్కువ యిక కష్టపడాల్సిన పనేం లేదు. ఎందుకో తెలుసా? అతను..... అతి త్వరలో ఎయిడ్స్ పేషెంట్ కాబోతున్నాడు......" చెప్పి నవ్వాడు దేశ్‌ముఖ్.

"ఎయిడ్స్ పేషెంటా........?!"

"ఎస్! శరీరమంతా పుచ్చిపోయిన ఓ ఫారిన్ ఎయిడ్స్ రోగితో అతను ఇవాళ గడుపుతున్నాడు. అతనికి ఎయిడ్స్ అని డాక్టర్ నిర్ధారణ చేయగానే, నీకు బంధవిముక్తి! నిన్ను హాయిగా నీ ఊరికి పంపిచేస్తాను" ఫోన్ పెట్టేశాడాయన.

ఆయన భయంకరమైన ప్లాన్‌కి నిశాంత చలించిపోయింది. గబగబా గెస్ట్‌హౌస్‌లోంచి పరుగు పరుగున బయటికొచ్చి అతనికోసం ఎంక్వయిరీ చేసింది.

ఆ హిప్పీ గ్రూప్ ఎక్కడుందీ తెలీదు.

టాక్సీ తీసుకుని అతడిని వెతకటం ప్రారంభించింది.

ఇరవైనాలుగు గంటలు గడిచిపోయాయి.

అతనెక్కడున్నాడో తెలీలేదు.

రాత్రింబవళ్ళూ అతనికోసం వెదుకుతూనే వుంది.

మర్నాడు రాత్రి-

పదకొండు గంటల వేళ-

ఢిల్లీ శివార్లలో హర్యానా రోడ్డులో పొలాల్లో, ఓ గుడిసెలో-

ఓ విదేశీ అమ్మాయితో గంజాయి తాగుతూ స్పృహలో లేని అతడిని చూసి చలించిపోయింది ఆమె.

ఆ అమ్మాయి నుంచి, ఆ బృందాన్నుంచి తప్పించి అతడిని సిటీలోకి తీసుకురావడానికి తలప్రాణం తోకకొచ్చింది ఆమెకు.

టాక్సీలో ప్రాణంలేని బొమ్మల్లా పడివున్నాడు అతను.

"నిశాంత! నన్నెక్కడకు తీసికెళ్ళొద్దు......ప్లీజ్......నాకా మత్తు కావాలి......నాకా అమ్మాయి కావాలి........నాకా హాయి కావాలి.......నిశాంతా..........

ప్లీజ్........లెట్ మీ గో" స్పృహలోకి వచ్చినప్పుడల్లా ఆమెను ప్రార్థిస్తున్నాడు అతను.

"నీకా అమ్మాయ్ కావాలా?" సీరియస్‌గా అడిగింది ఆమె.

"ఎస్! బలైక్ ఫ్రీడమ్........వాళ్ళతోపాటు ఆ అమ్మాయితో పాటు అలా..... అలా......ఏ....టో.....వెళ్ళిపోతాను. ఏం ఆ అమ్మాయితో తిరుగుతున్నానని జలసీగా వుందా?"

అలా అడుగుతున్న అతడివేపు కోపంగాన చూసింది ఆమె.

"నీకో వ్య క్తిత్వముందని ఇన్నాళ్ళూ అనుకున్నాను ఏ గాలి పడితే ఆ గాలికి కొట్టుకుపోయే మనిషివని ఇప్పుడే తెలిసింది. ఓ నాలుగురోజుల విచ్చలవిడి జీవితం నిన్నింత నాశనం చేస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. నీకో అమ్మాయి కావాలి. నీ బలహీనతకు అక్కడే స్వేచ్ఛ......అంతేనా?" టాక్సీ దిగి-

గెస్ట్‌హౌస్‌లోకి వస్తూ అలా అడుగుతున్న ఆమెవేపు ఆయోమయంగా చూశాడు అతను.

"నేనిన్నాళ్ళు జైలులో గడిపాను. నేనిప్పుడు మనిషిలా బ్రతకాలనుకుంటున్నాను. అందుకే నిశాంతా......ఐ లవ్ యూ బట్ ఐవాంట్ టు ఎంజాయ్. నువ్వు ముస్సోరీ వెళ్ళిపో! నేను తర్వాత వస్తాను"

అతడిలోని కొత్త మనిషిని చూసి ఆశ్చర్యపోయింది ఆమె.

అతను నిజంగా పాడయిపోయాడా? అంత బలహీనుడా? కళ్ళల్లో నీళ్ళు నిండాయి ఆమెకు.

"నీకు కావల్సింది శారీరకమైన కోర్కె. అంతేనా" పెల్లుబుకుతున్న కోపంతో అడిగింది ఆమె.